క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం


కొత్తపేటలో లక్ష్మీ గణపతి హోమం

రాంబిల్లి: కొత్తపేటలో సోమవారం భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. పరివర్తన ఏకాదశి, వామన జయంతి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుర్గమ్మ ఆలయంలో ఈ హోమం నిర్వహించారు. రాంబిల్లి మండలంలో 10 గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఈ హోమం, పూజల్లో పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రీజనల్ సహ కార్యవాహక యుగంధర్ సనాతన ధర్మం, ఆధ్యాత్మికతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు అప్పారావు, నూకరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మునగపాక : తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామంలో చర్యలు తీసుకుంటున్నామని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర తెలిపారు. గంగాదేవిపేట చెరువును ఆనుకొని మరమ్మతుకు గురైన మంచినీటి బోరును సోమవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. సర్పంచ్ గంగప్పలనాయుడు సహకారంతో గంగాదేవిపేటలో సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు.

ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలి


మునగపాకలో ఈకేవైసీ చేయిస్తున్న వీఏఏ సింధూజ

మునగపాక : ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని మునగపాక ఆర్‌బీకే వీఏఏ సింధూజ కోరారు. మునగపాక నందీశ్వర ప్రాంగణంలో సోమవారం రైతుల నుంచి ఈకై వైసీ కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పొలాల వద్ద ఈ-పంట నమోదుపై రైతులు దృష్టి సారించాలన్నారు. తద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే పలు రకాల విత్తనాలు,ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి


దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మునగపాక (అచ్యుతాపురం): అచ్యుతాపురంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సోమవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం నిర్వహించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాయుడుబాబు మాట్లాడుతూ దీన్‌దయాళ్ జనసంఘ్ వ్యవస్థాపకులుగా పనిచేశారన్నారు. ఏకాత్మతా మానవతావాదం సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయుడేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మేరుగు కాసుబాబు, బందారు కన్నంనాయుడు, రాజాన వెంకటరావు, కూండ్రపు చినబాబు పాల్గొన్నారు.

మెగా నేత్ర వైద్య శిబిరం రేపు

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెం గ్రామ శివారు జోగారావుపేటలో ఈ నెల 27న ఉదయం 9.30 గంటల నుంచి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమరసత సేవా సంఘం కన్వీనర్ మందపల్లి శివ తెలిపారు.

పీఏసీఎస్ సమావేశం రేపు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సర్వ సభ్య సమావేశం ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటలకు సంఘ ఆవరణలో జరగనుందని సంఘ సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యం


గుల్లిపాడులో సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారి


రామచంద్రపాలెంలో రోగులకు వైద్య పరీక్షలు


రాంబిల్లి మండలంలో ఆరోగ్య సర్వే

నక్కపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలకు ఇళ్ల వద్దే మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని మండల వైద్యశాఖాధికారి డాక్టర్ మురళీ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను గుల్లిపాడు గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారి వివరాలు నమోదు చేసుకున్నారు. గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి ఆరోగ్య సమస్యలు నమోదు చేసి, వారికి ఈ నెల 30 నుంచి గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఎప్పుడు నిర్వహించేది తమ సిబ్బంది ద్వారా సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో సోమవారం జరుగుతున్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు జరుగుతాయన్నారు. గ్రామాల్లో చేపట్టిన సర్వేకు అనుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఈ కార్యక్రమం భరోసాగా నిలుస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ అదికుమార్, వేల్ఫేర్ అసిస్టెంట్ రెడ్డినాయుడు, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మునగపాక(అచ్యుతాపురం): ఉప్పవరం సచివాలయం మల్లవరంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ పిన్నమరాజు రాజీ ఇంటింటికీ వెళ్లి సురక్షపై అవగాహన కల్పించారు. ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజీ కోరారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చురుగ్గా ఇంటింటా ఆరోగ్య సర్వే

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. బీపీ, షుగర్, రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంపీహెచ్ఈవో గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ రామరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతుంది. రాంబిల్లి పీహెచ్‌సీ పరిధిలో వెల్చూరు, అప్పన్నపాలెం తదితర గ్రామాలతో పాటు దిమిలి పీహెచ్‌సీ పరిధిలో పంచదార్ల, అప్పారాయుడుపాలెం తదితర గ్రామాల్లో ఆరోగ్య సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందస్తు సర్వే నిర్వహిస్తున్నారు.

30 నుంచి గ్రామాల్లో వైద్య పరీక్షలు

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామ సచివాలయాల్లో ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులుగా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష సర్వేలు అనంతరం గుర్తించిన వ్యక్తులకు ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది 30 వ తేదీ నుంచి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలో గల 24 గ్రామాల్లోను ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.


పాయకరావుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది


మునగపాక మండలంలోని గంగాదేవిపేటలో..


మూలపేటలో ఆరోగ్య సురక్ష సర్వే


మల్లవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పత్రాలు అందజేస్తున్న కన్వీనర్ రాజ

స్నేహితుని కుటుంబానికి అండగా..


స్నేహితుని కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని నాగవరం గ్రామానికి చెందిన స్నేహితుడు పత్తి కోటేశ్వరరావు మృతి చెందిన నేపథ్యంలో అతని కుటుంబానికి సాయం అందించేందుకు సహచర స్నేహితులు ముందుకొచ్చారు. మునగపాక హైస్కూల్‌లో 1996-97లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థి పత్తి కోటేశ్వరరావు ఈ నెల 10న డెంగ్యూ వ్యాధికి గురై మృతి చెందారు. దీంతో స్నేహితుడు కోటేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకునేందుకు సోమవారం రూ.50వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. బంగారుబాబు, వెలగా మురళి, వేగి వర్మ, బొడ్డేడ అప్పలనాయుడు, బుద్ధ నాగు, ఆడారి కాశీబాబు,వేగి ప్రసాద్,రాము,కాళ్ల సీతారామ్, ఆడారి రామారావు,మళ్ల రాంబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా స్నేహితుని కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చిన సహచర పూర్వ విద్యార్థులను స్థానికులు అభినందించారు.

పండగలా నా భూమి-నా దేశం


ఎంపీడీవో మన్మధరావుకు మట్టి, బియ్యం అందజేస్తున్న దృశ్యం


మహిళల చిటికెల భజన

- సేకరించిన మట్టి, బియ్యం ఎంపీడీవోకు అప్పగింత
- ఆకట్టుకున్న మహిళల చిటికెల భజన

మునగపాక: మునగపాకలో సోమవారం పండగ వాతావరణంలో నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా గ్రామాల్లో నాభూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మట్టి, బియ్యం సేకరించారు. ఇలా సేకరించిన సామాగ్రిని తీసుకుని మహిళల చిటికెల భజనలతో ఊరేగింపుగా వెళ్లి ఎంపీడీవో మన్మధరావుకు అందజేశారు. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల ముగింపు సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో ఎరకయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వలంటీర్లు, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

జోరుగా అన్న సమారాధనలు


పెనుగొల్లులో పూజలందుకున్న బొజ్జ గణపయ్య


దిమిలిలో అన్న సమారాధన

ఎస్.రాయవరం : గణపతి మండపాల వద్ద జోరుగా అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతున్నాయి. సోమవారం ఎస్.రాయవరం, పెనుగొల్లు, లింగరాజుపాలెం తదితర గ్రామాల్లో సుమారు రెండు వేలకు పైగా భక్తులకు అన్న సమారాధన చేశారు. సాయంత్రం హరి భజనలు, దీపారాధనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

రాంబిల్లి: మండలంలో సోమవారం పలు గ్రామాల్లో అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. దిమిలిలో నగిరెడ్డి వారి వీధి, పరదేశమ్మ ఆలయం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. కట్టుబోలు , మురకాడ గ్రామాల్లోనూ వినాయక ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

పెంజెరువు ఆయకట్టు రైతులను ఆదుకోవాలి


తహసీల్దార్ రాణీ అమ్మాజీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం సభ్యులు

యలమంచిలి : పెంజెరువు ఆయకట్టు రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు అన్నారు. సోమవారం యలమంచిలి తహసీల్దారు రాణీ అమ్మాజీకి రైతు సంఘం సభ్యులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వర్షపాతం తక్కువగా ఉండడం వల్ల ఎక్కువ గ్రామాల్లో పంటలు వేయలేదని, వేసిన ప్రాంతాల్లో కూడా నారు ముదిరిపోవడంతో సరైన దిగుబడులు రావన్నారు. యలమంచిలి పెంజెరువు దిగువన ఉన్న భూములకు మున్సిపాలిటీ చెత్త వల్ల కాలువలు పారడం లేదని, అందువల్ల నష్ట పరిహారం అందివ్వాలని రైతు సంఘం నాయకులు తహసీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో నగిరెడ్డి సత్యనారాయణ, ఆడారి ఆదిమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి


12 వ వార్డులో మురుగునీటి కాలువలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : మున్సిపాలిటీలో వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆమె సూచించారు. సోమవారం ఆమె కమిషనర్ కె.కొండలరావుతో కలసి 12 వ వార్డులో మిలటరీ కాలనీ, కొత్తపేట, యాతపేట, శివాలయం వీధి చాకలిపేట ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ కాలువలు, మట్టి రోడ్లు, రోడ్లకు ఇరువైపుల మట్టి దిబ్బల తొలగింపుపై అధికారులను ఆదేశించారు. రోడ్లపై ఇరువైపుల చెత్తను తొలగింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో శాశ్వత డ్రైనేజి, గుంతలు లేని రోడ్లు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని, వార్డుల్లో మౌలిక వసతులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని అన్నారు. పర్యటనలో శానిటరి ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, వార్డు కౌన్సిలర్ పిల్లా కనకమణి, త్రినాథ్, సుందరపు బాబ్జి మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు సురక్షితం


దిమిలి పీహెచ్‌సీలో తల్లీబిడ్డలతో డాక్టర్ వెంకటేష్, వైద్య సిబ్బంది

రాంబిల్లి : పీహెచ్‌సీల్లో ప్రసవాలు సురక్షితమని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకటేష్ అన్నారు. సోమవారం ఇక్కడి పీహెచ్‌సీలో ప్రసవం జరిగింది. తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా, క్షేమంగా ఉన్నారని డాక్టర్ వెంకటేష్ తెలిపారు. పీహెచ్‌సీలో మంచి ఆరోగ్య సేవలు అందుతాయని, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉండాలి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : ఉపాధ్యాయ సంఘాలు మరింత బలోపేతంగా ఉండాలంటే ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉండాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటపతిరాజు అన్నారు. మండలంలో కొరుప్రోలు,ఎస్.రాయవరం,దార్లపూడి తదితర గ్రామాల్లో ఏపీటీఎఫ్ సంఘ సభ్యత్వాలు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ రద్దు చేస్తూ పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌కు సన్మానం


కన్నారావును సన్మానిస్తున్న కమిషనరేట్ కార్యాలయ ఉద్యోగులు

పాయకరావుపేట : పాయకరావుపేట గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్ ఈరుగుల కన్నారావును సోమవారం విజయవాడ పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో ఘనంగా సన్మానించినట్టు పంచాయితీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తెలిపారు. పది సంవత్సరాలుగా ఈరుగుల కన్నారావు పంచాయతీ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్‌గా పనితనం, క్రమశిక్షణ, అంకితభావంతో వృత్తిని నిర్వహించడం వల్ల డీపీవో జిల్లా కలెక్టర్ నివేదిక మేరకు కమిషనరేట్‌లో కన్నారావును సన్మానించి, జ్ఞాపికను అందించినట్టు కార్యదర్శి తెలిపారు.

రైతుల సహకారంతో సొసైటీ అభివృద్ధి


తిమ్మరాజుపేట మహాజన సభలో నివేదిక చదువుతున్న దృశ్యం

మునగపాక(అచ్యుతాపురం): రైతుల సహకారంతో పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తున్నామని తిమ్మరాజుపేట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాండ్రేగుల అప్పారావు తెలిపారు. సోమవారం సంఘ ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా రూ.24 కోట్ల మేర డిపాజిట్లు కలిగి ఉత్తరాంధ్ర జిల్లాలో తిమ్మరాజుపేట సొసైటీ గుర్తింపు పొందిందన్నారు. రూ.18.56 లక్షల మేర నికర లాభం ఆర్జించామన్నారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి సహాయపడిన ఉత్తమ రైతులను సత్కరించారు. అంతకుముందు సంఘం సీఈవో సూరిమహేశ్వరరావు సంఘ నివేదిక చదివి వినిపించారు. సంఘం మాజీ అధ్యక్షుడు మారిశెట్టి సూర్యనారాయణ, సర్పంచ్ భాగ్యలక్ష్మి శివ బాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు గ్రైండర్ వితరణ


గ్రైండర్‌ను పాఠశాలకు అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి దేవవరం గ్రామానికి చెందిన రియల్టర్లు ఇందుకూరి సుధారాజు, రవిరాజు సుమారు రూ.20వేలు విలువ కలిగిన గ్రైండర్‌ను వితరణగా అందజేశారు. పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులున్నారు. సోమవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయులకు గ్రైండర్‌ను అందజేశారు. దాతలను ఎంపీపీ అభినందించారు.

ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణకు పదోన్నతి



నక్కపల్లి : నక్కపల్లి మండల ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న పి.వెంకటనారాయణకు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ఏడాది క్రితం ఆయన నక్కపల్లి ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంతో వెంకటనారాయణకు ఎంపీడీవోగా అవకాశం లభించింది. దీంతో ఆయన కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఎంపీడీవోగా పదోన్నతి పొందిన వెంకటనారాయణను ఏపీఎఫ్ యుడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ , ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, పలువురు పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

లాభాల్లో అన్నపూర్ణ బ్యాంక్


సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: తుమ్మపాల పీఏసీఎస్(అన్నపూర్ణ బ్యాంక్) బ్యాంక్ అందరి సహకారంతో ఏటా లాభాల్లో నడుస్తోందని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక గాంధీనగరం బ్యాంక్ ఆవరణలో సోమవారం జరిగిన మహాజనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అవసరాల నిమిత్తం బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీ(రూ.0.75 పైసల)కే రుణాలు అందిస్తున్నామని, దీన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. రైతులకు కావాల్సిన అన్నిరకాల ఎరువులు 170 టన్నుల వరకు సరఫరా చేసిన ఘనత పీఏసీఎస్‌దేనన్నారు. సంఘం అధ్యక్షుడు పీడీ గాంధీ మాట్లాడుతూ సంఘం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి లాభాల్లో నడిపిస్తున్నామని, ఈ ఏడాది రూ.5 లక్షల 19 వేలు లాభం వచ్చిందన్నారు. త్వరలోనే సభ్యులకు లాభాలు పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ గొర్లి సూరిబాబుతో చర్చించి బ్యాంకుకు షాపింగ్ కాంప్లెక్స్ మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆడిట్ రిపోర్టు, బడ్జెట్‌ను సంఘం సభ్యులు ఆమోదించారు.

సంగీత, సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు


పాటల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: సంగీత సాహితీ ప్రపంచంలో అనకాపల్లికి ఇంద్రగంటి శ్రీనివాస్ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి పురస్కరించుకుని కల్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పాటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇంద్రగంటి అందిస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. బాలూకి అనకాపల్లితో, తమ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోని తెలుగు వారి గాత్రం ఎక్కడ వినిపించినా అది బాలూ పాటేనని కొనియాడారు. అనంతరం పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ ఇంద్రగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.